6న వికాస కార్యాలయంలో జాబ్ మేళా

కాకినాడ : కాకినాడలోని వికాస కార్యాలయంలో ఈ నెల 6న జాబ్ మేళా నిర్వహిస్తున్నామని వికాస పీడీ కెఎల్.రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో భావిక్రియేషన్స్ కంపెనీలో గ్రాఫిక్ డిజైనర్, వెబ్ డెవలపర్, ఫ్రెంట్ ఆఫీస్ అసిస్టెంట్, సోషల్ మీడియా, మార్కెటింగ్ ఫీల్డ్ స్టాఫ్, ఇంటర్న్‌షిప్, ఎస్ఇఒ, కాంటెంట్ రైటర్స్ టెక్ మహీంద్రా కంపెనీలో బిపిఒ, ఇజిఒ డీల్స్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, డెక్కన్ కెమికల్స్‌లో ట్రైనీ(ప్రొడక్షన్), సోలారా యాక్టివ్ ఫార్మాసైన్సెస్ ప్రొడక్షన్ టెక్నిషియన్, రిలయన్స్ రిటైల్లో పికింగ్, ప్యాకింగ్, శ్రీకాళహస్తి పైప్స్ లిమిటెడ్, ఇండో ఎంఎం కంపెనీల్లో టెక్నిషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటి.ఐ, డిప్లొమో, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన 30ఏళ్ల అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈ నెల 6న వికాస కార్యాలయంలో సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలన్నారు.

హామీలు సరే...అమలేదీ?

సిఎం జగన్ జిల్లాలో పలుమార్లు పర్యటన
అభివృద్ధి పనులకు నిధులు విదల్చని వైనం
పరిష్కారానికి నోచుకోని సమస్యలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

గత ఎన్నికలకు ముందు, ముఖ్యమంత్రి అయిన తరువాత జగన్ జిల్లాలో పలుమార్లు పర్యటించారు. గడచిన నాలుగున్నరేళ్లలో నాలుగు సార్లు అధికారకంగా పర్యటించి సభలు జరిపారు. జిల్లాలో రూ.374.40 కోట్లతో 8 అభివద్ధి పనులకు ఆయన హామీ ఇచ్చారు. కాని నేటికీ ఒక్క హామీ కూడా అమలు చేయలేకపోయారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన దాఖలాలు లేవు.

కలగా... ఏలేరు ఆధునికీకరణ

2022 జూలై 29న పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలులో మూడో విడత వైఎస్ఆర్ కాపు నేస్తం పథకాన్ని జగన్ బటన్ నొక్కి ప్రారంభించారు. స్థానిక ఎంఎల్ఎ పెండెం దొరబాబు కోరిక మేరకు ఏలేరు ప్రాజెక్టు ఫేజ్-1లో మిగిలిపోయిన పనుల కోసం రూ.142 కోట్లు, ఫేజ్-2లో ఆధునికీకరణకు రూ.150 కోట్లు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. నేటికీ ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ఫలితంగా ఏలేరు ఆయకట్టు రైతులు కష్టనష్టాలతో బతుకులు వెళ్లదీస్తున్నారు. ఏలేరు ఆధునికీకరణ పనులు పూర్తయితే వేలాదిమంది రైతుల కష్టాలు తీరతాయి. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు నుంచి గట్టు ఎక్కుతారు. ప్రస్తుతం కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సాగునీరు పూర్తిస్థాయిలో అందక అనేక కష్టాలు పడుతున్నారు. జగన్ హామీ ఇచ్చి ఏడాదిన్నర కావొస్తున్నా ఆధునికీకరణకు నిధులు కేటాయింపు ఊసు ఎత్తడం లేదు. ఇదే సభలో పిఠాపురం, గొల్లప్రోలు, ఒక్కో మున్సిపాల్టీకి రూ.20 కోట్లు చొప్పున రూ.40 కోట్లు మంజూరు చేస్తున్నామని ఆర్భాటంగా ప్రకటించారు. ఈ నిధులతో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుకోవచ్చని తెలిపారు. కాని నేటికీ ఒక్క రూపాయి విదల్చలేదు. అభివృద్ధికి ఆమడ దూరంలో రెండు మున్సిపాలిటీలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. అంతకంటే ముందు రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 అక్టోబర్ 2న ముఖ్యమంత్రి స్థాయిలో జగన్ కాకినాడ రూరల్ నియోజకవర్గం కరపలో పర్యటించారు. అక్కడ గ్రామ సచివాలయం ప్రారంభోత్సవం, సిబ్బందికి మార్గనిర్దేశం చేయడానికే పరిమితమయ్యారు. అప్పుడు ఎటువంటి హామీలు ఇవ్వలేదు. 2020 డిసెంబర్ 25న యు.కొత్తపల్లి మండలం కొమరగిరి వచ్చిన ఆయన రాష్ట్ర వ్యాప్తంగా నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించినా జిల్లాకు ఎటువంటి హామీలు ఇవ్వలేదు.

సామర్లకోట సభలో...

ఈ ఏడాది అక్టోబర్ 12న సామర్లకోట ఇటిసి జగనన్న కాలనీలో జరిగిన సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమం సందర్భంగా జరిగిన సభలో పెద్దాపురం నియోజకవర్గం పరిధిలో ఉన్న కాండ్రకోట బ్రిడ్జికి రూ.4 కోట్లు, గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఒక్కో సచివాలయం పరిధిలో మరో రూ.20 లక్షలు అదనంగా ఇస్తామని ప్రకటించారు. 72 గ్రామ, వార్డు సచివాలయాలకు రూ.14.40 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. పెద్దాపురం మండలం కాండ్రకోట బెడ్ రెగ్యులేటర్ పునర్నిర్మాణానికి రూ.6 కోట్లు, సామర్లకోటలో జూనియర్ కళాశాలను డిగ్రీ కళాశాలగా అప్ గ్రేడ్ చేసేందుకు రూ.18 కోట్లు మంజూరు చేస్తున్నట్లు జగన్ వేదికపై నుంచి హామీ ఇచ్చినా పనుల్లో కదలిక కనిపించడం లేదు.

ఏలేరు రిజర్వాయర్

పాదయాత్రలో హామీలిచ్చినా....

జగన్ 2019 ఎన్నికలకు ముందు నిర్వహించిన పాదయాత్రలో కాలుష్యం వెదజల్లే దివీస్ పరిశ్రమ వస్తే ప్రజల ఇబ్బందులను గమనించారు. రైతులు వ్యతిరేకిస్తున్న దివీస్ ను బంగాళాఖాతంలో కలిపేస్తామని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకొచ్చిన తర్వాత దివీస్‌కు అనుకూలంగా వ్యవహరించడమే కాకుండా శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి స్థానంలో హాజరు కావడానికి ప్రయత్నం చేశారు. ప్రజా వ్యతిరేకత నేపథ్యంలో పర్యటనను విరమించుకున్నారు. ప్రస్తుతం కాలుష్యకారక దివీస్ పరిశ్రమ పనులు జరుగుతున్నాయి. కాకినాడ సెజ్‌లో భారీ ఎత్తున పరిశ్రమలు తీసుకొస్తామని 13 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం సుమారు 10 వేల ఎకరాలు భూములను రైతుల నుంచి బలవంతంగా లాక్కున్నారు. నేటికీ పరిశ్రమలను స్థాపించలేదు. అయితే 2019 ఎన్నికల ప్రచారానికి పిఠాపురం వచ్చిన జగన్ తాను అధికారంలోకి వస్తే రైతులు, నిపుణులతో కమిటీ వేసి వారి నిర్ణయం ఆధారంగా వ్యవహరిస్తామని, రైతులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పుకొచ్చారు. తమ భూములు తమకే దక్కుతాయని,సాగు చేసుకోవచ్చునని రైతులంతా ఆశ పడ్డారు. కానీ కొందరికి మాత్రమే సుమారు 2 వేల ఎకరాలు తిరిగి ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. మిగిలిన 8 వేల ఎకరాలు నేటికీ నిరుపయోగంగానే దర్శనమిస్తున్నాయి. జగన్ హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2018 జూలై 21న పాదయాత్ర సందర్భంగా కాకినాడలో నిర్వహించిన మత్స్యకారుల ఆత్మీయ సమావేశం సందర్భంగా జగన్ మత్స్యకారులను వివిధ రూపాలలో ఆదుకోవడంతో పాటు కాకినాడ డీప్ వాటర్ పోర్టు కార్మికుల కూలి రేట్లు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కానీ నేటికీ కూలి రేట్లు మాత్రం పెరగకపోగా కనీసం వారి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కృతికాశుక్లా

ఎన్నికల నిర్వహణకు సమాయత్తం

కలెక్టర్ కృతిక శుక్లా

ప్రజాశక్తి - కాకినాడ

రానున్న సాధారణ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో అవసరమైన అన్ని ఏర్పాట్లతో సమాయత్తం అవుతున్నామని కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనాకు వివరించారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్‌మీనా జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో 2024 సాధారణ ఎన్నికల నిర్వహణకు సంసిద్ధతగా చేపట్టాల్సిన కార్యాచరణను సమీక్షించారు. రాష్ట్రంలో జిల్లాల పునర్ వ్యవస్థీకరణ తరువాత జరుగనున్న ఎన్నికల దష్ట్యా గడచిన 2014, 2019 ఎన్నికల సమయంలో, ప్రస్తుత నూతన జిల్లాల భౌగోళిక పరిధిలో అనుసరించిన కార్యాచరణలను, అనుభవాలను పరిగణనలోకి తీసుకుంటూ రానున్న ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు సమగ్రంగా చేపట్టాలని ఆయన సూచించారు. ఇందులో భాగంగా ఎన్నికల నిర్వహణ అధికారులు, సిబ్బంది నియామకం, వారికి అవసరమైన శిక్షణ, కమ్యూనికేషన్, రవాణా ప్రణాళికలు, ప్రవర్తనా నియమావళి అమలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, శాంతిభద్రతలు, పోలీస్ దళాల అవసరం, సి-విజిల్ ఓటరు హెల్ప్ లైన్ యాప్‌లపై అవగాహన కల్పన తదితర అంశాలపై సమీక్షించి సూచనలు జారీ చేశారు.

ఈ సమావేశంలో కలెక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,637 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. సమస్యాత్మక, సునిశిత కేంద్రాలను గుర్తించి వాటి మ్యాపింగ్ చేపట్టామని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో ఉన్నారని తెలిపారు. జిల్లాలో ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం ప్రతి వెయ్యి జనాభాలో 718 మంది నిష్పత్తిలో ఓటర్లు ఉన్నారని, అలాగే ప్రతి వెయ్యి మంది పురుష ఓటర్లకు 1028 మంది మహిళా ఓటర్లుగా లింగ నిష్పత్తి ఉందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ నిమిత్తం 8 ట్రైనింగ్ సెంటర్లు, 7 డిస్పాచ్ సెంటర్లు, 7 రిసెప్షన్ సెంటర్లు, 14 స్ట్రాంగ్ రూమ్‌లు, 14 కౌంటింగ్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికలను స్వచ్ఛమైన శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అవరమైన ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. అదనపు దళాల అవసరాలపై ప్రతిపాదనలు సమర్పించామని తెలిపారు. జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ కె.శ్రీధరరెడ్డి, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

జడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్‌సాగర్ పుట్టినరోజు సందర్భంగా తాళ్లరేవులో ఆయన స్వగహంలో సాగర్ అభిమానులు శనివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఈ రక్తదాన శిబిరంలో అధిక సంఖ్యలో యువకులు పాల్గొని రక్త దానం చేసి ప్రాణదాతలు కావాలని సాగర్ కోరారు.

మినీ మేనిఫెస్టోపై ప్రచారం

ప్రజాశక్తి -కరప

కరపలో టిడిపి మినీ మేనిఫెస్టోపై టిడిపి, జనసేన నాయకులు ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి, జనసేన పార్టీ నాయకులు, కాకినాడ మాజీ మేయర్ కవికొండల సరోజ, మండల నాయకులు బండారు మురళి, రాష్ట్ర నాయకుడు అభోగి రెడ్డి గంగాధర్, కొండబాబు, బుంగ సింహాద్రి, కాకర్ల బుజ్జిబాబు, పిజానకి రామయ్య, కోటగిరి మహేంద్రబాబు, జయేంద్ర బాబు, మహేష్ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రజలకు ఆమోదయోగ్యమైన మేనిఫెస్టోను టిడిపి ప్రకటించిందన్నారు. దీన్ని ప్రజల్లోకి తీసనుకెళ్తున్నామన్నారు.

బస్సుయాత్ర జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కాజులూరు

సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరిలో భాగంగా ఈ నెల 5వతేదీ సాయంత్రం 6 గంటలకు జరిగే బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం మండల కన్వీనర్ వల్లు రాజబాబు పిలుపునిచ్చారు. చేదువాడ వంతెన వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ప్రజారక్షణభేరి పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలు నానా కష్టాలు పడుతున్నారన్నారు. అధిక ధరలతో బెంబేలెత్తుతున్నారన్నారు. రాష్ట్రానికి బిజెపి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. బిజెపి ప్రభుత్వ హయాంలో మతోన్మాదం పెచ్చిరిల్లిందన్నారు. రాష్ట్రంలో ఉన్న మూడు ప్రధాన పార్టీలు బిజెపికి అంటగాగుతూ రాష్ట్ర ప్రజలను మోసగిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపికి ప్రజల బుద్ధి చెప్పాలని కోరారు. దీనిపై అందుకనే ప్రజా సమస్యలపై చైతన్యం పెంచేందుకే ఈ బస్సు యాత్ర వస్తుందని దీనికి ప్రజలందరూ కాకినాడ ఇంద్రపాలెం లాకులు వద్ద జరిగే బస్సు యాత్రకు 5వ తేదీ సాయంత్రం 6 గంటలకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కురుపూడి భూచక్రం, వాసంశెట్టి సత్యనారాయణ, మాతా రామకృష్ణ, షేక్ మీరా షాజహాన్, పెంకె నాగేశ్వరరావు, పెంకె శ్రీను, కె.శ్రీను,జె.శ్రీనివాస్, షేక్ మెహబూబా పాల్గొన్నారు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజాబాబు తదితరులు

పెత్తందార్లతో పోలీసుల కుమ్మక్కు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

దళితులపై దాడి చేసి ఎస్‌సి పేటలో నానా బీభత్సం సష్టించి దళితులను తరిమికొట్టిన పెత్తందార్లతో పోలీసులు కుమ్మక్కయ్యారని సిపిఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగారాావు ఆరోపించారు. ఆయన శుక్రవారం దాడిలో గాయపడ్డ బాధితులను పరామర్శించారు. దాడి జరిగి ఐదు రోజులైనా ఇప్పటికీ పూర్తిస్థాయిలో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకోలేదన్నారు. దళితులు ఫిర్యాదు చేసిన వారిపై నేటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్నారు. గ్రామంలో దళితులపై అప్రకటిత సాంఘిక బహిష్కరణ కొనసాగుతుందన్నారు. దళితులను పనులకు పిలవడం లేదని, పనులకు వెళ్లిన యువకుల్ని వెనుక్కి పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు అరకొర అరెస్టులు చూపించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఫిర్యాదు చేసినా పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు.

5న 'సిద్ధార్థ'లో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని సిద్ధార్థ హాస్పిటల్‌లో ఈ నెల 5న ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్టు డాక్టర్ ముత్తా ఆదిత్యకృష్ణ వెల్లడించారు. దశాబ్ద కాలంలో 2వేలకు పైగా మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాలో వేయికి పైగా ఆసియన్ స్పెసిఫిక్ మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించిన మొదటి ఆసుపత్రిగా సిద్ధార్థ నిలిచిందన్నారు. మోకాళ్ల నొప్పులతో బాధ పడేవారికి ఈనెల 5వ తేది ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సిద్ధార్థ హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్యాంపులో ఉచిత కన్సల్టేషన్, 10రోజులకు మందులు, అవసరమైన వారికి ఎక్స్‌రే వంటివి నిర్వహిస్తారన్నారు. రూ.1.75 లక్షల విలువచేసే మొకాళ్ల మర్పిడి ఆపరేషన్ ప్రత్యేక ప్యాకేజీలో రూ.1.25లక్షలకే అందిస్తున్నామన్నారు. ఈ సదుపాయం తెల్ల రేషన్ కార్డు గల పేద, మధ్య తరగతి వారికి నవంబర్ నెల రోజులు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సాయం అందిస్తున్న సంఘం ప్రతినిధులు

సంక్షేమం కోసమే సేవా సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

నాయీ బ్రాహ్మణ కుటుంబాలకు సంక్షేమం చేకూర్చేందుకు శ్రీ భీమేశ్వర నాయీ బ్రాహ్మణ సేవా సంఘాన్ని ఏర్పాటు చేశామని నాయకులు పొన్నాడ రమణ, వెదురుపాక సూర్యప్రకాశ్ తెలిపారు. ఇటీవల మతిచెందిన సభ్యులు లంక అప్పన్న, తాతాపూడి దుర్గ కుటుంబాలకు సంఘం తరుపున శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శ్రీ భీమేశ్వర నాయీబ్రాహ్మణ సేవా సంఘాన్ని నూతనంగా ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ చేయించినట్లు చెప్పారు. ఈ సంఘానికి పొన్నాడ రమణ అధ్యక్షులుగా, వెదురుపాక సూర్య ప్రకాష్ ఉపాధ్యక్షులుగా, వెదురుపాక శివ కార్యదర్శిగా, ఏడిద సురేష్ సహాయ కార్యదర్శిగా, పుల్లేటికుర్తి తాతాజీ కోశాధికారిగా వ్యవహరిస్తారన్నారు. లంక అప్పన్న కుటుంబానికి రూ.11 వేలు, తాతపూడి దుర్గ కుటుంబానికి రూ.18 వేలను సంఘం తరపున అందిచామని తెలిపారు.

పాలకమండలి సమావేశంలో పాల్గొన్న సభ్యులు, చైర్మన్ తదితరులు

రత్నగిరిపై అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి - అన్నవరం

రత్నగిరిపై పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు పాలకమండలి ఆమోదం తెలిపింది. దేవస్థానంలో శుక్రవారం పాలకమండలి సమావేశం ట్రస్ట్ బోర్డ్ సమావేశం హాలు ఆవరణలో చైర్మన్ రాజా ఐవి.రోహిత్ అధ్యక్షతన జరిగింది. దేవస్థానం ఇఒ ఎస్.ఆజాద్ పాలన, వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి 67 అంశాలను ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. ముఖ్యంగా కొండపైన పాత సిఆర్ఒ కార్యాలయం వెనుక నుంచి దిగువ వచ్చే మూడవ టర్నింగ్ వద్ద నిర్మిస్తున్న రహదారికి జగద్గురు ఆదిశంకరాచార్య జ్ఞాపకార్థం ఆదిశంకరాచారి మార్గ నామకరణం చేసే అంశాన్ని అమోదించారు. సచ్చగిరి కొండపైన 150 ఎకరాల స్థలంలో సోలార్ ప్లాంట్ నిర్మాణానికి లీజుకు ఇచ్చే అంశాన్ని ఆమోదించారు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సప్లిమెంటరీ బడ్జెట్‌ను ఆమోదించారు. కార్తీకమాసంలో తాత్కాలిక నిర్మాణ పనులకు సంబంధించిన అంశాన్ని అమోదించారు. ఈ సమావేశంలో ఎసి రమేష్‌బాబు పాలకమండలి సభ్యులు, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అధికారులు, వివిధ విభాగాల ఎఇఒలు, పిఆర్ఒ జగ్గారావు, రిసెప్షన్ అధికారి పి.లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు

సిఐటియు కాకినాడ రూరల్ కన్వీనర్‌గా రాజా

ప్రజాశక్తి - కాకినాడ

సిఐటియు కాకినాడ రూరల్ కన్వీనర్‌గా తొట్టెంపూడి రాజా ఎన్నికయ్యారు. కాకినాడ రూరల్ మండలం సిఐటియు విస్తత సమావేశం కచేరి పేట సుందరయ్య భవన్‌లో మేడిశెట్టి వెంకటరమణ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. యూనియన్ పెట్టుకుని సమస్యలు పరిష్కరించమని అడుగుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్న యూనియన్ రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్‌లను అమలు చేయకపోవడం దారుణమన్నారు. కార్మికుల రిటైర్డ్ అయిన తర్వాతా పెన్షన్ ఇతర సౌకర్యాలు అందట్లేదన్నారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చేంతవరకు పోరాడాలని పిలుపునిచ్చారు.

17 మందితో కన్వినింగ్ కమిటీ...

అనంతరం కాకినాడ రూరల్ సిఐటియు కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా టి.రాజా, కో- కన్వీనర్లుగా మేడిశెట్టి వెంకటరమణ, వాసంశెట్టి చంద్రరావు, చామంతి కుమారి, శ్రీహరి ఎన్నికయ్యారు. మిటీ సభ్యులుగా టి.నాగేశ్వరరావు, అంబటి రామకృష్ణ, వి.రవికుమార్, అనంతలక్ష్మి, జుత్తుగ శ్రీనివాసరావు, వీరవేణి, గాంధీ, ఏసు, వీరబాబు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సత్యనారాయణ, రాంబాబు, శ్రీను, రాజు, రవి, దుర్గాప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

చంద్రబాబుపై తప్పుడు కేసులు : ఎంఎల్ఎ చినరాజప్ప

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్రంలో ఉన్న మద్యం, ఇసుక ఇతర పకృతి వనరులను సిఎం జగన్ యథేచ్ఛగా దోచుకుంటున్నారని, మాజీ సిఎం చంద్రబాబు మాత్రం తప్పుడు కేసులను ఎదుర్కొనాల్సి పరిస్థితి ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. 2021 అక్టోబర్ 6న కాకినాడ సీ పోర్టులోకి అక్రమంగా ప్రవేశించి అక్కడ పనులకు ఆటంకం కల్పించారనే ఫిర్యాదుపై టిడిపి నేతలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నవీన్‌కుమార్, వనమాడి వెంకటేశ్వరరావు, ఎస్‌విఎస్ఎన్.వర్మ, కొమ్మారెడ్డి పట్టాభిరాం, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, యనమల కృష్ణుడు, మోకా ఆనంద సాగర్, తుమ్మల రమేష్‌లపై పోర్ట్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ మేరకు 41ఎ నోటీసులు అందుకునేందుకు టిడిపి నాయకులు శుక్రవారం కాకినాడ పోర్టు పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. అనంతరం పోర్టు పోలీస్ స్టేషన్ బయట విలేకరులతో నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి వెంకటేశ్వరరావు, నల్లమిల్లి రామకష్ణారెడ్డి మాట్లాడారు. కాకినాడ సీ పోర్టులో మాదకద్రవ్యాలకు సంబంధించి సరఫరా జరుగుతోందని, తనిఖీల నిమిత్తం వెళ్లేందుకు అనుమతి తీసుకున్నామన్నారు. అప్పుడు ఎలాంటి కేసులు పెట్టని పోలీసులు ఇప్పుడు అక్రమంగా కేసులు నమోదు చేశారన్నారు. రెండేళ్ల పాటు కాలయాపన చేసి గత నెలలో నోటీసులు తీసుకోవాలంటూ పోలీసులు వేధింపులు గురి చేశారని తెలిపారు. తనతో పాటుగా హాజరైన నాయకులందరిపై 10 నుంచి 35 పైగా అక్రమ కేసులు ఉన్నాయన్నారు.



ఎంఎల్ఎ చినరాజప్పకు నోటీసులు అందిస్తున్న పోలీసులు

న్యాయం కోసం వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. త్వరలోనే జగన్ దుర్మార్గ పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలుగుతుందన్నారు. పదేళ్లుగా సిఎం జగన్ బెయిల్‌పై బయటే ఉంటున్నారన్నారు. ఈ విషయాన్ని సుప్రీంకోర్టుకు తీసుకెళ్లామన్నారు. దీనిపై వివరాలను సుప్రీంకోర్టు అడగడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో పోర్టు పోలీస్ స్టేషన్ సిఐ విఎల్‌వికె.సుమంత్, వన్ టౌన్ సిఐ వి.సురేష్‌బాబు, పోర్ట్ ఎస్ఐలు షేక్ జబ్బీర్, జి.రాజేశ్వరరావు, టిడిపి నాయకులు మల్లిపూడి వీరు, ఎమ్‌డి తాజుద్దీన్, తుమ్మల సునీత, ఒమ్మి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వైసిపితోనే సామాజిక సాధికారత

ప్రజాశక్తి- ఏలేశ్వరం

వైసిపి ప్రభుత్వ హయాంలోనే అన్ని సామాజిక వర్గాలు సాధికారత సాధించాయని ప్రతిపాడు ఎంఎల్‌ఎ పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. స్థానిక ఎన్.కన్వెన్షన్ హాల్లో శుక్రవారం జరిగిన మండల, టౌన్, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్, ఎంపిటిసి సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాటాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించిన ఘనత వైసిపికే దక్కుతుందన్నారు. ఈ నెల 9 నుంచి జరిగే 'జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ పనితీరును వివరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు ఎన్.రామ కుమారి, వైస్ ఎంపిపి చిక్కాల రాజేశ్వరి, నాయకులు ఎ.చలమయ్య, ఎస్.వెంకటేశ్వరరావు, చిక్కాల లక్ష్మణరావు, మండల కన్వీనర్ ఎస్.చిన్నారావు పాల్గొన్నారు.

5వ రోజుకు పాటంశెట్టి దీక్ష

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని రాజపూడిలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాటంశెట్టి సూర్యచంద్ర చేపట్టిన నిరవధిక దీక్ష శుక్రవారం నాటికి ఐదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సూర్యచంద్ర మంత్రి అంబటి రాంబాబుకు బహిరంగ లేఖ రాశారు. గండేపల్లి మండలం తాళ్లూరు వద్ద ఉన్న పుష్కర ఎత్తిపోతల పథకానికి సంబంధించి మోటార్లు పనిచేయట్లేదన్నారు. ఫలితంగా వేల ఎకరాల పంటలు ఎండిపోయాయని తెలిపారు. వాటిని పరిశీలించి నష్టపరిహారం ప్రకటించాలని లేఖలోకోరారు. ఆయన దీక్షకు పలువురు రైతులు సంఘీభావం తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు, ఆలమూరు

వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం లచ్చి పాలెం జంక్షన్ సమీపంలో 216 జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. హైవే పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాకినాడకు చెందిన పినిపోతు రాంబాబు కాజులూరులోని తన అత్తవారి ఇంటికి వెళ్లాడు. తిరిగి కాకినాడ వెళ్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రాంబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. హైవే పోలీసులు ఆయన్ని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని చెముడులంక కాలువ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. హైవే పెట్రోలింగ్ పోలీసులు తెలిపిన వివరాలు...కడియం మండల కేంద్రానికి చెందిన పొడుగుమాటి తేజ కపిలేశ్వరపురం మండలం తాతపూడిలో వెల్డింగ్ పని చేసుకుంటున్నాడు. తన పని ముగించుకుని స్వగ్రామం బైక్‌పై వెళ్తే క్రమంలో ఎదురుగా వెళ్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు మధ్యలో గల డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తేజ తీవ్రగాయలపాలయ్యాడు. క్షతగాత్రుని హైవే అంబులెన్స్‌పై రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. కాగా అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్య సిబ్బంది తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వెంకటేశ్వర స్వామి గుడి సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మహిళా మతి చెందింది. స్థానిక వక్కలంక వారి వీధికి చెందిన కేదిరిశెట్టి వెంకటలక్ష్మి (46)అనే మహిళ సినిమా సెంటర్ వైపు వెళుతుండగా గేదెలు ఎదురుగా రావడంతో పక్కకు తప్పుకుని ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకుంది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ వి.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం మండలంలోని వెలంపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇరువురిని అరెస్టు చేసినట్టు ఎఎస్‌ఐ భుజంగరావు తెలిపారు. చప్పిడి సత్యనారాయణ అనే వ్యక్తి 9 బ్రాండ్ సీసాలతో అదుపులోకి తీసుకున్నామని, అలాగే ముఠకల అన్నవరం అనే వ్యక్తి వద్ద నుంచి మూడు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - గోకవరం

షార్ట్ సర్క్యూట్ కారణంగా తాటాకు ఇల్లు దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. .మండలంలోని గంగంపాలెం పంచాయతీ పరిధి ఠాకూర్ పాలెం గ్రామానికి చెందిన యలంపర్తి చిన్నాల దొరకి చెందిన తాటాకు ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల పూర్తిగా దగ్ధం అయింది. ఇంటి యజమాని కుటుంబీకులు కట్టుబట్టలతో మిగిలారు. ఆస్తి నష్టం సుమారు రూ.3 లక్షలపైనే ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం తగినరీతిలో నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కుటుంబీకులు కోరారు. సంఘటనా ప్రాంతాన్ని తహశీల్దార్ శ్రీనివాస్ సందర్శించారు. అలాగే మండల సచివాలయ కన్వీనర్ దాసరి రమేష్, సుంకర వీరబాబు అగ్నిప్రమాదం బాధిత కుటుంబాన్ని పరామర్శించి కూరగాయలు, బియ్యం, వంట సామాగ్రి, కొంత నగదును అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దొడ్డి నాగేశ్వరరావు, చింతల అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితులకు ధైర్యం చెప్పి బియ్యం, బట్టలు, వంట సామాన్లు, రూ.5 వేలు నగదు ను అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్ అప్పలరాజు, ఉంగరాల రాము, పిల్లా వంటిబాబు, కొత్త సురేంద్రబాబు, కంచుమర్తి రాఘవ, సాలాపు సలమహారాజు, ఉంగరాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడు అరెస్టు

ప్రజాశక్తి - ఆలమూరు

మద్యం బెల్ట్ షాపు నిర్వాహకుని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తూరు సెంటర్లో బెల్ట్ షాప్ నడుపుతున్నట్లుగా ముందస్తు సమాచారంతో బెల్ట్ షాపుపై దాడి చేశామన్నారు. ఈ దాడిలో గుత్తుల వీర వెంకటరమణ వద్ద 12 నిబ్బుల మందు సీసాలతోపాటు అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై కులదూషణ కేసు నమోదు

ప్రజాశక్తి - బిక్కవోలు

కులం పేరుతో దూషించి చంపేస్తానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు బిక్కవోలు ఎస్ఐ బుజ్జిబాబు తెలిపారు. బిక్కవోలు గ్రామం రాజారావుపేటకు చెందిన గరగా వెంకటరాజు ఇటీవల ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. అతనిని పరామర్శించేందుకు గ్రామానికి చెందిన దుళ్ళ రత్నరాజు వెళ్లాడు. ఆదేసమయంలో అతని వద్ద ఉన్న జల్లూరి వెంకన్న బాబు పరామర్శకు వెళ్లిన రత్నరాజును మా ఇళ్లకు పరామర్శించడానికి రావడం ఏమిటని ప్రశ్నించి కులం పేరుతో దూషించాడని, మాట్లాడితే చంపేస్తానని బెదిరించినట్లు రత్నరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

'జగనన్న గోరుముద్ద' తనిఖీ

సామర్లకోట రూరల్ : స్థానిక జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం నిర్వహణను ఎంఇఒ వై.శివరామకృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంలో, గుడ్లలో నాణ్యత లోపించిందని ఇటీవల జిల్లా మానవ హక్కుల సంఘం నాయకుడు ఫిర్యాదు మేరకు హెచ్ఎం యు.మీనామాధురితో కలిసి ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని రుచిచూశారు. నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం పాఠశాలకు హాజరైన 421 మంది విద్యార్థులు భోజనం చేసారన్నారు. ఈ పాఠశాలకు వెండపూడి ఏజెన్సీ నుంచి ఆహారం సరఫరా అవుతుందన్నారు. కోడి గుడ్లు ప్రభుత్వ ప్రమాణాలకు అనుకూలంగా ఉన్నాయన్నారు. తెలుగు పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

సామర్లకోట రూరల్ : రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి కేంద్రాల్లో మద్దతు ధర ఇచ్చేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఎపి ఎస్.ఇలక్కియా అన్నారు. పెద బ్రహ్మదేవంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. దళారీ వ్యవస్థను అరికట్టేందుకు ప్రభుత్వం ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కొనుగోళ్లలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ పుష్పమణి, ఎడిఎ జివి.పద్మశ్రీ, ఎఒ ఇమ్మిడిశెట్టి సత్య, ఎంపిటిసి సభ్యులు మలకల సూర్యారావు (సూరిబాబు), సొసైటీ అధ్యక్షుడు మలకల వరాలబాబు, ఆర్‌బికె సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

4 ,5న ఓటర్ల నమోదు

కరప : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 4, 5తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు చేపట్టామని తహశీల్దార్ పి.శ్రీనివాసరావు తెలిపారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. అలాగే మార్పులు చేర్పులకు అవకాశం ఉందన్నారు.

రైతులకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఏరువాక కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం(విజయవాడ) సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు వరి, అపరాలు, మొక్కజొన్న పంటల సాగు విధానాలపై రెండు రోజులపాటు నిర్వహించే రైతు సదస్సును శుక్రవారం వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ పి.మునిరత్నం ప్రారంభించారు. అనంతరం జరిగిన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. కేంద్రీయ సమగ్ర సస్య రక్షణ కేంద్రం మొక్కల సంరక్షణాధికారి డాక్టర్ ఒ.వీరబాబు వ్యవసాయ శాస్త్రవేత్తలను వేదికపైకి ఆహ్వానించారు. వ్యవసాయ పరిశోధనా కేంద్రం అధిపతి డాక్టర్ పి.మునిరత్నం వరి, అపరాలు, మొక్కజొన్న పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు యాజమాన్య పద్ధతులు, సస్య రక్షణ, ఎలుకల నివారణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.నరసింహారావు మాట్లాడారు. ఎలుకల నిర్మూలనపై అవగాహన కల్పించారు. రైతుల ప్రయోజనార్థం ఎలుకల నివారణ,వరిలో బ్యాక్టీరియా ఎండు తెగులు నివారణకు సంబంధించిన సాంకేతిక బులిటెన్‌ను ఆవిష్కరించారు. ఈ సదస్సులో సహాయ మొక్కల సంరక్షణాధికారి డాక్టర్ కె.దక్షిణామూర్తి, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ మానుకొండ శ్రీనివాస్, డాక్టర్ ఎ.సీతారామశర్మ, డాక్టర్ ఒ.సుధీర్ కుమార్, డాక్టర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న మునిరత్నం

కార్తీక మాసం ఏర్పాట్లపై సమావేశం

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం దేవస్థానంలో ఈనెల 14 నుంచి వచ్చేనెల 12 వరకు జరిగే కార్తీక మాసం ఏర్పాట్లపై దేవస్థానం ఇఒ ఎస్.ఆజాద్, చైర్మన్ ఐవి.రోహిత్ అధ్యర్యంలో దేవస్థానం, ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్తీకమాసంలో అధిక సంఖ్యలో వచ్చేయాత్రికులకు, వారికి కల్పించాల్సిన సౌకర్యాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడారు. ముఖ్యంగా కార్తిక సోమవారాలు, పౌర్ణమి, ఏకాదశి రోజున పంపాలో నిర్వహించే తెప్పోత్సవం, జ్వాలా తోరణం, గిరి ప్రదక్షిణ వంటి పర్వదినాల్లో వచ్చే యాత్రికుల రద్దీ దృష్ట్యా మరిన్ని పకడ్బందీ ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందన్నారు. అందుకు తగ్గట్టుగా సదుపాయాలు కల్పించే క్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు దేవస్థానం అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో దేవస్థానం ఎసి రమేష్‌బాబు, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, ఫిషరీస్, విద్యుత్, పంచాయతీ, అగ్నిమాపక, వైద్య ఆరోగ్యశాఖ ఎపిఎస్ఆర్‌టిసి ఇతర శాఖల అధికారులు దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

ప్రయివేటు స్థలంలో ప్రభుత్వ భవనాలు

ప్రజాశక్తి- కడియం

ప్రభుత్వ భూముల్ని ప్రయివేటు వ్యక్తులు ఆక్రమించడం, ప్రయివేటు వ్యక్తుల భూముల్ని కొందరు భూబకాసురులు ఆక్రమించడం, దౌర్జన్యంగా స్వాధీనం చేసుకోవడం, నకిలీ పత్రాలు సృష్టించి దొంగ రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం లాంటి సంఘటనలు తరచూ చూస్తుంటాం. కాని కడియం మండలంలో దీనికి భిన్నంగా ఒక వ్యక్తికి సంబంధించిన స్థలంలో అధికారుల పర్యవేక్షణలో ప్రభుత్వ భవనాలు నిర్మించడం చర్చనీయాంశమైంది. మండలంలోని వేమగిరి గట్టు ప్రాంతంలో సర్వే నెంబర్ 354లో గల ప్రభుత్వ స్థలంలో మూడు ప్రభుత్వ భవనాలు నిర్మాణాన్ని ఏడాది క్రితం మొదలు పెట్టారు. సగానికి పైగా పనులు పూర్తి కావొచ్చాయి. జిల్లా ఉన్నతాధికారులు కూడా వీటి నిర్మాణాలను పర్యవేక్షించారు. సుమారు 118 గజాలకు సంబంధించిన సొంత స్థలంలో అక్రమంగా ప్రభుత్వ భవనాల నిర్మాణం చేపట్టారని, వాటిని వెంటనే తొలగించి న్యాయం చేయాలని స్థల యజమాని కడియం తహశీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఫిర్యాదుపై రెవెన్యూ అధికారులు విచారణ చేశారు. ఆక్రమణ జరిగినట్లు నిర్ధారించి నిర్మాణాలు నిలుపుదల చేయాలని, గుత్తేదారునకు బిల్లుల చెల్లింపులు ఆపాలని, ఆక్రమణలు తొలగించాలని ఎంపిడిఒ, మండల ఇంజినీరింగ్ అధికారులకు నోటీసులు ఇచ్చారు. సుమారు రూ.78 లక్షల అంచనాలతో ఈ పనులు చేపట్టారు. రూ.40 లక్షల విలువైన పనులు పూర్తయినట్లు సమాచారం. సచివాలయ భవన నిర్మాణంలో సుమారు 8 గజాలు స్థలం డీవియేట్ అయినట్లుగా, అది కూడా పుంతరోడ్డుగా నిర్ధారించినట్టు సమాచారం. రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరం, కడియం మండలం వేమగిరి సరిహద్దు ప్రాంతం కావడంతో అప్పట్లో ఇరు మండలాల రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేసి స్థలాలను గుర్తించి ఉంటే ఈ సమస్య వచ్చేదికాదని కొందరు వాదన. దీనిపై కడియం తహశీల్దార్ ఎం.సుజాత మాట్లాడుతూ వేమగిరి గట్టు ప్రాంతం సర్వే నెంబర్ 354లో గల సుమారు 6 సెంట్ల ప్రభుత్వ భూమిని గుర్తించి రెండు భవనాల నిర్మాణాల నిమిత్తం సంబంధిత అధికారులకు గతంలోనే అప్పగించామన్నారు. తదుపరి ఇటీవల ఒక వ్యక్తి దరఖాస్తు చేసుకోగా మరల సర్వే చేసి భవన నిర్మాణాలు డీవియేట్ అయినట్లుగా గుర్తించి, సంబంధిత అధికారులకు నోటీసులు ఇచ్చామన్నారు. మండల పరిషత్, మండల ఇంజనీరింగ్ అధికారుల వివరణ కోరగా నిబంధనలు, సరిహద్దులకు లోబడి సర్దుబాటు చేసి భవన నిర్మాణాలు చేపట్టామన్నారు. రాజమండ్రి రూరల్, కడియం మండలాల రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేయాల్సి ఉందన్నారు.

నేటి నుంచి ఓటర్ల ప్రత్యేక నమోదు

యానాం : పుదుచ్చేరిప్రభుత్వం అక్టోబరు 27న ప్రారంభించిన ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా ఈ శని, ఆదివారాల్లో యానాంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం జరుగుతుందని పుదుచ్చేరి ప్రధాన ఎన్నికల అధికారి పి.జవహర్ తెలిపారు.ఈ అవకాశాన్ని యువత, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

బాణసంచా తయారీ కేంద్రాల పరిశీలన

బిక్కవోలు : బలభద్రపురం, బిక్కవోలు గ్రామాల్లో బాణాసంచా సామాగ్రిని తయారు చేసే కేంద్రాలను అనపర్తి అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ రెడ్డి, బిక్కవోలు తహశీల్దార్ పోసిబాబు, ఎస్ఐ బుజ్జిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా బాణా సంచా తయారు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కేంద్రాల్లో నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు.

పూర్తి స్థాయిలో నాణ్యతా ప్రమాణాల నిర్ధారణ

సామర్లకోట రూరల్ : జిల్లాలో రైతుల ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యత విషయంలో మోసపోకుండా పూర్తిస్థాయిలో నిర్ధారణ చేసేందుకు చర్యలు చేపట్టామని జెసి ఇలక్కియా తెలిపారు. ఇందు కోసం 275 టెక్నికల్ అసిస్టెంట్లు, 275 మంది ఆపరేటర్లను నియమించామన్నారు. శుక్రవారం పిఠాపురంలో ఆమె మాట్లాడారు. ఆర్‌బికెలు, రైసు మిల్లుల వద్ద ఒకే రకమైన తేమశాతం చూసే యంత్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆర్‌బికె వద్ద నిర్ధేశించిన నాణ్యతా ప్రమాణాలు మాత్రమే పరిగణిస్తారన్నారు. మిల్లరు ఎవరైనా నాణ్యతకు సంబంధించిన అంశాలు లేవనెత్తితే మిల్లు వద్ద నున్న కస్టోడియన్ అధికారి, మండల స్థాయి సిబ్బంది వాటిని పరిష్కరిస్తారన్నారు. ఒకసారి ఎఫ్‌టిఒలు రైతుకు అందించిన తరువాత రైతు మిల్లుకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. మద్దతు ధర కల్పించడంతో పాటు, గోనె సంచుల వినియోగానికి, హమాలీలకు, రవాణాకు అయ్యే ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. మిల్లుకు పంపిన వాహనంలో ధాన్యాన్ని 3 గంటల్లోగా అన్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. జిపిఎస్ అమర్చిన వాహనాలను ధాన్యం రవాణాకు వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ పుష్పమణి, ఎడిఎ జివి.పద్మశ్రీ, జిల్లా టెక్నికల్ అధికారి విజయ రాజు, ఎంపిడిఒ, తహశీల్దార్, ఎఒ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రక్షణ భేరి పోస్టర్ ఆవిష్కరణ

ఏలేశ్వరం : అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం నవంబర్ 15న విజయవాడలో నిర్వహించే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను విజయవంతం కోరుతూ ప్రత్తిపాడులో పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకుడు రొంగల ఈశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.శ్రీను, ఎస్.సత్తిబాబు, కె.సతీష్, పి.రమణ, సురేష్, వరలక్ష్మి ఉన్నారు.

9 వరకు వల్లభ స్వామి దర్శనం నిలిపివేత

పెద్దాపురం : మండలంలోని తిరుపతిలోని శృంగార వల్లభస్వామి ఆలయ గర్భాలయంలో మరమ్మతులు కారణంగా ఈనెల 9 వరకు మూల విరాట్ దర్శనం నిలిపి వేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి తెలిపారు. అప్పటివరకు ఉత్సవమూర్తులతో దర్శనం ఏర్పాటు చేశామన్నారు. 10వ తేదీ నుంచి యథావిధిగా మూలవిరాట్ దర్శనం ఉంటుందన్నారు. యాత్రికులు, భక్తులు గమనించాలన్నారు.

ఆదిత్యలో '5జి సర్వీసెస్‌'పై శిక్షణ

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం 5జి రంగంలో వినియోగించే 5జి అప్లికేషన్, వినియోగించే పద్ధతిపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇసిఇ విభాగానికి చెందిన డాక్టర్ తాతబాబు ఆధ్వర్యంలో శిక్షణ అధిపతిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస్‌రెడ్డి, ఐఐసి కన్వీనర్ డాక్టర్ పి.ఎస్.రంజిత్, కో-ఆర్డినేటర్ డాక్టర్ అనిల్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ వి.సునీత పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న ఎంపి భరత్, మాజీ ఎంఎల్‌ఎ రౌతు, అజ్జరపు వాసు

బర్మాకాలనీలో రామాలయం పునఃప్రతిష్టాపన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని 48వ డివిజన్ బర్మా కాలనీలో శ్రీ విష్ణ్వేశ్వర కోదండరామ సుబ్రహ్మణ్య సాయి సహిత ఆలయ పునఃప్రతిష్టాపన శుక్రవారం జరిగింది. ఎంపీ భరత్‌రామ్, వైసిపి అర్బన్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, మాజీ ఎంఎల్ఎ రౌతు సూర్యప్రకాశరావు, సిటీ ఫాసల్ ఎమ్‌డి వంశం కొండలరావు, ప్రముఖ పారిశ్రామికవేత్త బివిఎస్.రెడ్డి, వైసిపి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మాజీ కార్పొరేటర్లు మోతకూరి సత్యనారాయణ, మానే దొరబాబు, స్వర్ణాంధ్ర నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు, తదితరులు పాల్గొని భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు మాట్లాడారు. పురాతన కాలం నాటి ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకుందన్నారు. దాని స్థానంలో ఆలయాన్ని పునఃప్రతిష్టాపన చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. ఈ కార్యక్రమం సిద్ధాంతి సత్యనారాయణ, తాడేపల్లిగూడెం రామశర్మ సారథ్యంలో జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు రేలంగి హరీష్, పంపిని వీరబాబు, డి.జగదీష్, తామాద దుర్గాప్రసాద్, లోకేష్, స్థానికులు ఎల్‌బిసి కన్నారావు, కుంచె శేఖర్, బంటి, గెద్దం శ్రీను, బుజ్జి, ధనరాజు, వేణు, వినయ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కోతకు సిద్ధమైన వరిచేలు

- దళారుల ప్రమేయం తగ్గించాలన్న రైతులు
- రవాణా, హమాలీ ఛార్జీలు రైతులకు చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి-రామచంద్రపురం

అనేక ఒడిదుడుకులు తట్టుకుని నిలిచిన తొలకరి వరి చేలు పంటకాలం పూర్తయి కోతకు సిద్ధమయ్యాయి. కె.గంగవరం మండలంలోని 16,ఎకరాల్లోనూ, రామచంద్రపురం మండలంలోని 18 వేల ఎకరాల్లోనూ తొలకరి పంటలు కోతకు సిద్ధమయ్యాయి. ప్రస్తుతం వాతావరణం పంటలకు అనుకూలించినప్పటికీ అల్పపీడన ద్రోణి ప్రభావంతో గత రెండు రోజులుగా వర్షాలు కురవడంతో కోతలు మరో వారం పాటు వాయిదా పడే అవకాశం ఉంది. నవంబర్ 12 నుండి కోతలు ముమ్మరంగా ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అయితే తొలకరి పంటకు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా ఏర్పాటు చేయకపోవడంతో రైతన్నలు ఆయోమయానికి గురవుతున్నారు. దీనితోపాటు ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధర రైతులకు గందరగోళం కలిగిస్తోంది. రైతులు ధాన్యం ట్రాన్స్‌పోర్ట్, హమాలి చార్జీలు కలిపి బస్తాకు రూ.80 ఖర్చు అవుతుంది. దీనికి రైతుల వద్ద నుండి కొనుగోలు దారులు వసూలు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం హమాలీ చార్జీలు, ట్రాన్స్‌పోర్ట్‌కు రూ.37 చెల్లిస్తుండగా దాన్ని కూడా ధాన్యం వ్యాపారులే తీసుకుంటున్నారని దీంతో ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న రాయితీలు వర్తించడం లేదని పలువు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలులో పేరుకు మాత్రమే పిఎసిఎస్ లు వ్యవహరిస్తున్నారని, గ్రామంలో గల కొనుగోలుదారులే ధాన్యం సేకరించి లాభాలను ఆర్జిస్తున్నారని పలువురు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ట్రాన్స్‌పోర్ట్, హమాలీ చార్జీలు వారికే వెళ్తున్నాయన్నారు. వీటిని రైతులకు అందేలాగా అధికారులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. లేకుంటే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం మద్దతు ధర ప్రకటించిన, దళారులకు ప్రభుత్వం అందించే రాయితీలు చేరకుండా అందకుండా రైతులు కూడా తమ పంటను విక్రయించే అవకాశం కల్పించాలని కొరుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వారి ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వరిచేలు

ఓటు నమోదుపై అవగాహన

ప్రజాశక్తి-అయినవిల్లి

ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తహశీల్దార్ నాగ లక్ష్మమ్మ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చేపట్టిన ఓటర్ల నమోదు ఈ నెల 4,5 తేదీల్లో నిర్వహించే ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. 18 ఏండ్లు నిండిన వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. పై తేదీలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అయినవిల్లి మండలం లోని ప్రతి పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ లో ఏ విధమైన అభ్యంతరాలు ఉంటే సరైన ధ్రువపత్రాలు తో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ నాగ లక్ష్మమ్మ

అగ్ని ప్రమాద బాధితునికి లయన్స్ క్లబ్ సాయం

ప్రజాశక్తి అమలాపురం రూరల్

రోళ్లపాలెం గ్రామంలో రాయుడు సత్తిబాబు తాటాకు ఇల్లు ఇటీవల విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నికి ఆహుతి అయింది. బాధిత కుటుంబానికి శుక్రవారం రోళ్లపాలెంలో లయన్స్ క్లబ్ సభ్యులు సమకూర్చిన కిరాణా సరుకులు, 25 కేజీల బియ్యం ప్యాకెట్లు అందజేశారు. ప్రెసిడెంట్ లయన్ జివిఎస్ మల్లిబాబు మాట్లాడుతూ నిస్సహాయులకు సహాయం చేయడానికి లయన్స్ క్లబ్ ఎప్పుడు ముందుంటుందని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ లయన్ చిక్కాల సతీష్, లయన్ పట్నాల వెంకటరమణ, లయన్ షేక్ నౌషాద్, లయన్ గుమ్మళ్ల తాతయ్యకాపు, గ్రామస్తులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

విజేతలకు బహుమతులు అందజేసిన దృశ్యం

వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

పోలీస్ అమర వీరుల వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలంలోని మెడ్రెస్ డిగ్రీ కాలేజ్, పలుస్కూల్లలో సిఐ వి.దుర్గారావు, ఎస్ఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు, డిబేట్ నిర్వహించారు. వీటితోపాటు రామచంద్రపురం సర్కిల్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు రామచంద్రపురం డిఎస్‌పి టిఎస్ఆర్ కె.ప్రసాద్ చే బహుమతులుఅందజేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎంపి చింతా అనురాధ సమకూర్చిన రూ.5 లక్షలతో గొల్లవిల్లి పంచాయతీ అశోక్ నగర్ దళితపేటలో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం సర్పంచ్ బొక్కా శ్రీధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొంగ కనకదుర్గ, పంచాయతీ వార్డు సభ్యులు దొంగ శ్రీను, చెప్పిడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గోగిపేటలో డ్రెయినేజ్ నిర్మాణ పనులు

ప్రజాశక్తి-కొత్తపేట

గ్రామ సచివాలయ నిధులతో నిర్మించే డ్రైనేజీ నిర్మాణ పనులను శుక్రవారం జెడ్‌పిటిసి సభ్యురాలు గూడపాటి రమాదేవి, సర్పంచ్ బూసి విజయలక్ష్మిలు ప్రారంభించారు. గోగిపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించిన ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డికి పలు సమస్యలను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందించి గ్రామస్తులు ఇచ్చిన హామీ ప్రకారం సచివాలయం పరిధి నిధుల నుంచి నిధులను మంజూరు చేశారు. సుమారు రూ.4లక్షలతో డ్రైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు.

ఆటో వర్కర్ల యూనియన్ జిల్లా సమావేశం

ప్రజాశక్తి-అమలాపురం

ఆంధ్ర ఆటోవాలా ఆటో వర్కర్స్ యూనియన్ అమలాపురం 9 సెంట్రల్ కమిటీ మెంబర్స్ విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం ఈదరపల్లి లో జిల్లా ఆటో యూనియన్ ఆఫీసులో జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు వాసంశెట్టి సత్తిరాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ఎఐటియుసి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కెఎస్.బాబు హాజరయ్యారు. ముఖ్యంగా జిల్లా యూనియన్ సమావేశంలో మండలం, డివిజన్ స్థాయిలో, ఆటో యూనియన్ నూతన కమిటీల నియామకం ఉండాలని తీర్మానించారు. ఆ ప్రకారం డివిజన్ స్థాయి కమిటీ సభ్యులకు సమావేశం ప్రస్తావించారు. కెఎస్.బాబు ప్రసంగించారు. ఈసందర్భంగా పలు తీర్మానాలు చేశారు. యూనియన్ కార్యకలాపాలు, ఆవిదా స్థాయిగా మాసెందుకు ఒక తాత్కాలిక కమిటీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సత్తిరాజు సమక్షంలో నియమించారు. బొలిశెట్టి శంకర్, ఏఐటియుసి నాయకుడు ఈ కమిటీకి తాత్కాలిక కన్వీనర్ గా నియమిస్తూ కమిటీ సభ్యులుగా రాయుడు ప్రసాద్, కర్రి భీమరాజు,, బొక్క నాని, రావూరి రాంబాబు, పదుచూరి చిన్న తదితరులను వీరిని కమిటీ సభ్యులుగా నియమిస్తూ తీర్మానించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 94432
కాకినాడ, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99189

జర్నలిజం పట్ల ఆసక్తి, సామాజికస్పృహ ఉన్నాయా?
మీరు విన్నది కన్నది పది మందితో పంచుకుందామనుకుంటున్నారా?
ప్రజాశక్తి
అయితే దరఖాస్తు పంపండి
విలేకర్లు కావలెను
దినపత్రికలో పనిచేసేందుకు క్రింది తెలిపిన కేంద్రాల్లో విలేకర్లు కావలెను
• రాజమండ్రి సిటీ • రాజమండ్రి కార్పొరేషన్ • రాజమండ్రి క్రైం
• కోరుకొండ • రంగంపేట • కిర్లంపూడి • జగ్గంపేట
• కాకినాడ కార్పొరేషన్ • కాకినాడ భానుగుడి • పెద్దాపురం రూరల్
• తుని • తుని రూరల్ • తొండంగి • ప్రత్తిపాడు • గొల్లప్రోలు • పి.గన్నవరం
• ముమ్మిడివరం • అల్లవరం • రాయవరం • కె.గంగవరం • మలికిపురం
• రాజోలు • సఖినేటిపల్లి • అనపర్తి • నిడదవోలు రూరల్
విలేకర్లకు అర్హత
ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజం పట్ల ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన
ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో బయోడేటాను మెయిల్ చేయాలి
prajagodavari@gmail.com
సంప్రదించాల్సిన నెంబర్లు 92918 01804, 94900 99169

మహారాజశ్రీ రాజమండ్రి 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఒ.ఎస్.నెం. 448/2017
బిట్వీన్:
1) బేకి రాము
2) బేకి కుమారి ...వాదులు
VS
1) కాలేపు వరలక్ష్మి (డైడ్)
2) వై.దుర్గా భవాని
3) యు.పద్మావతి
4) కె.వి.వి.నాగరాజు ...ప్రతివాదులు
పై నెంబరు దావాలో పేరా 3వ ప్రతివాది అయిన మీరు ఉన్నారు. కోర్టు ద్వారా మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించినా మీరు పుచ్చుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా తిప్పి పంపించుచున్నారు. కావున కోర్టువారి ఉత్తర్వుల మేరకు పత్రికాముఖంగా ఇందుమూలముగా తెలియపర్చడమేమనగా ది.20-11-2023వ తేదీన వాయిదా వేయడమైనది. కావున మీరు ది.20-11-2023వ తేదీ ఉదయం గం.10:30 ని.లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరయ్యి మీయొక్క అభ్యంతరాలు తెలియపరచుకోవలెను. లేనిచో మీ గైర్హాజరుతో కేసు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా : 20-11-2023
శ్రీ తోట వెంకటేశ్వరరావు
శ్రీ కొలసాని కనకదుర్గ
శ్రీ తోట పవన్ కళ్యాణ్
అడ్వకేట్స్, కొవ్వూరు.
సెల్: 73969 17878